క్లుప్తంగా

ఘనంగా మల్లికార్జున స్వామి శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

సరుబుజ్జిలి: శివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని మండలంలోని పెద్దపాలెం గ్రామానికి సమీపంలోని దంతపురి క్షేత్రంలో భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామివారి శోభాయాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి తరువాత స్వామివారి లింగోద్భవం నిర్వహించి, తదుపరి వేదమంత్రాలు నడుమ శోభాయాత్ర చేపట్టారు. ఆలయ ధర్మకర్త గజ్జన కృష్ణారావు, ఆలయ అర్చకులు కిరణ్‌శర్మ పాల్గొన్నారు.

ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు



యాత్ర ప్రదేశాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: ప్రతి ఏటా మండలంలోని చాపర గ్రామంలో మంగళవారం జామి జాతర నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ రామారావు, వైస్ సర్పంచ్ ఈశ్వరమ్మ తెలిపారు. మండలంలోని చుట్టు పక్కల గ్రామాల నుంచి వేల సంఖ్యలో ప్రజలు యాత్రకు తరలివస్తారని, ఎల్లమ్మ తల్లిని దర్శించుకుంటారన్నారు. జాతర నిర్వహించే ప్రదేశాన్ని ఆదివారం పరిశీలించి, జాతర జరిగే ప్రదేశంలో పిచ్చి మొక్కలు తొలగించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.

కుట్టు మిషన్లు పంపిణీ



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న రజిత్‌కుమార్

పొందూరు: మండలంలోని లోలుగు గ్రామంలో ఉపహార్ స్వచ్ఛంద సంస్థలో ఆశాదీవెన టైలరింగ్ సెంటర్ ద్వారా శిక్షణ పొందిన మహిళలకు ఆ సంస్థ నేషనల్ డైరెక్టర్ రజిత్‌కుమార్ పాణి కుట్టుమిషన్లు అందజేశారు. ఆదివారం లోలుగు ఉపహార్ సంస్థలో 31 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఉపహార్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లింగోద్భవం



లింగోద్భవం నిర్వహిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని పురుషోత్తపురం ఉమాకామేశ్వరి స్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు గంగవరపు వాసుదేవశర్మ ఆధ్వర్యంలో శనివారం అర్ధ రాత్రి తరువాత లింగోద్భవం నిర్వహించారు. ముందుగా శివలింగానికి చుట్టూ నాగాభరణంతో వస్త్రం చుట్టి లింగం నిండినంతవరకు బియ్యం, పండ్లు, పూలతో నింపారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. లింగోద్భవాన్ని భక్తులు తిలకించారు.

శివలింగానికి విభూది అలంకరణ



శివలింగాన్ని విభూదితో అలంకరించిన దృశ్యం

సారవకోట: మండలంలోని అవలింగి గ్రామంలోని మల్లేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి మరుసటి రోజు పురస్కరించుకుని శివలింగానికి విభూదితో అలంకరించారు. స్వామి వారికి ప్రత్యేక, విశేష పూజలు చేపట్టారు.

లుకలాంలో చక్రతీర్థ స్నానాలు

నరసన్నపేట: మండలంలోని లుకలాం వద్ద గల వంశధార నదీ తీరంలో సోమవారం చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తున్నట్లు కామేశ్వర స్వామి ఆలయ ట్రస్టీ సభ్యుడు ప్రసాద్, లుకలాం సర్పంచ్ తవిటి నాయుడు ఆదివారం తెలిపారు. ఏటా కామేశ్వరిపేటలోని కామేశ్వర స్వామికి లుకలాం నదీ తీరంలో చక్రతీర్థ స్నానాలు చేయించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అమావాస్య–పాడ్యమి కలిసిన సందర్భంగా ఈ కార్యక్రమం చేస్తామన్నారు. ఈ సందర్భంగా యాత్ర నిర్వహిస్తామని ప్రసాద్ తెలిపారు.

● ప్రమాదకర ప్రయాణం



ఏజీ రోడ్డులో రావిచెంద్రి సమీపంలో వంట సామాన్లపైన కూర్చుని వెళ్తున్న దృశ్యం

గమ్యానికి చేరుకోవాలన్న తపనేతో పలువురు వాహనదారులు ప్రమాదకరమైన ప్రయాణాలు చేస్తున్నారు. ఎల్.ఎన్.పేట మండలంలో అలికాం–బత్తిలి (ఏజీ) రోడ్డులో శనివారం నాటి ప్రయాణ దృశ్యాలు ఇవి. ఓ శుభకార్యక్రమానికి లగేజీ ఆటో నిండుగా వంట పాత్రలు ఎక్కించి, ఆ సామాన్లపై ఇద్దరు వ్యక్తులు కూర్చుని వెళ్తున్నారు. మరో దృశ్యంలో ఏజీ రోడ్డులో మినుము, పెసర పంటను ఆటోలో నిండుగా ఎక్కించి ఇద్దరు వ్యక్తులు వెనుక వైపు నిల్చుని వెళ్తున్నారు.
– ఎల్.ఎన్.పేట



ఏజీ రోడ్డులో కోవిలాం వద్ద ఆటో వెనుక నిల్చుని వెళ్తున్న దృశ్యం

● మహా అన్నసంతర్పణ



మెళియాపుట్టి మండలంలోని చాపర గ్రామంలో ఆదివారం మహా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శివరాత్రి వేడుకలను ముగించుకున్న గ్రామస్తులు రెండో రోజు చాపర శివాలయంలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు చేపట్టారు. ప్రతీ ఏటా శివస్తోత్ర మాలిక, తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మహాప్రసాదాన్ని పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. – మెళియాపుట్టి

నేడు చక్రతీర్థ స్నానాలు



మిరియాపల్లి రేవు వద్ద ఏర్పాటు చేసిన కంచె

● వంశధార నదిలో చుట్టూ కంచె నిర్మాణం

ఎల్.ఎన్.పేట: మండలంలోని మిరియాపల్లి రేవులో సోమవారం సంప్రదాయబద్ధంగా జరిగే శ్రీముఖలింగేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం శివపార్వతుల చక్రతీర్థ స్నానాలు కావటంతో ఈ ఏడాది భక్తుల సంఖ్య పెరుగుతుందని అంచనా వేశారు. జలుమూరు మండలంతోపాటు ఎల్.ఎన్.పేట మండలంలోనూ చక్రతీర్థ స్నానాలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. పోలీసులు, ఆలయ అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. మిరియాపల్లి రేవులో వంశధార నదిలో చుట్టూ కంచెను ఏర్పాటు చేశారు. కంచె మధ్యలోనే చక్రతీర్థ స్నానాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని సరుబుజ్జిలి ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ తెలిపారు.

అన్నసంతర్పణకు ఏర్పాట్లు

మిరియాపల్లి వద్ద శ్రీముఖలింగేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాలకు వచ్చే భక్తులకు అన్న సంతర్పణ కోసం ఏర్పాటు చేస్తున్నామని గ్రామ మాజీ సర్పంచ్ జమ్మి మోహనరావు తెలిపారు. దబ్బపాడు గ్రామంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి అన్నసంతర్పణ జరుగుతుందన్నారు. గత అయిదేళ్లుగా ప్రతీ ఏడాది వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణ చేస్తున్నామని, అదే విధంగా ఈ ఏడాది కూడా అన్న సంతర్పణ కోసం ఏర్పాట్లు చేశామన్నారు.

పారిశుద్ధ్య పనులు

శ్రీముఖలింగం చక్రతీర్థ స్నానాల నేపథ్యంలో మిరియాపల్లి గ్రామంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టామని సర్పంచ్ కోడి సుధారాణి, పంచాయతీ కార్యదర్శి జయమోహన్ పాఢి తెలిపారు. వీధుల్లో, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తనుతొలగించి గ్రామానికి దూరంగా వేశామన్నారు. పలు వీధి శివారుల్లో రోడ్డుపైనే మట్టి దిబ్బలు ఉన్నందున గ్రామంలో వాడుక, వర్షం నీరు వెళ్లటం లేదని గుర్తించామని తెలిపారు. మట్టిని కూడా తొలగించామన్నారు. వీధుల్లో బ్లీచింగ్ వేయించామన్నారు.



అన్నసంతర్పణ కోసం ఏర్పాట్లు చేస్తున్న దబ్బపాడు గ్రామస్తులు



వీధి శివారులో మట్టి తొలగింపును పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి

వైభవంగా రామయ్య సంబరం



బూర్జ: మండల కేంద్రంలో రామయ్య తండ్రి సంబరాలను తొత్తడి కుటుంబ సభ్యులు రామయ్య తండ్రి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఐదు ఏళ్లకు ఒకసారి ఈ సంబరం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. మహాశివ రాత్రికి ముందు ఆదివారం గానీ.. తరువాత గానీ సంబరం నిర్వహిస్తారు. శుక్రవారం ప్రారంభమైన సంబరం ఆదివారంతో ముగిసింది. తప్పెటగుళ్లు, మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించిన సంబరంలో రామయ్య తండ్రిని కొలువుదీరుస్తారు. మూడురోజులపాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆఖరిరోజు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

రామయ్య తండ్రి సంబరం నిర్వహిస్తున్న తొత్తడి కుటుంబ సభ్యులు

స్నేహితుడికి చేయూత



ఆర్థిక సహాయం అందజేస్తున్న తోటి విద్యార్థులు

మెళియాపుట్టి: స్నేహితుడు కష్టకాలంలో ఉన్నట్లు తెలుసుకుని తోటి స్నేహితులు రూ.22,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండలంలోని సంతలక్ష్మీపురం గ్రామానికి చెందిన రంధి దామోదరం గతకొంతకాలంగా కిడ్నీవ్యాధితో బాధపడుతున్నారు. కరజాడ గ్రామంలో 1998–99లో పదో తరగతి కలిసి చదువుకున్న వారందరూ ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. దామోదరం ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని వెంటనే డబ్బులు జమచేసి అందించారు. దామోదరం కుటుంబానికి అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. కృష్ణారావు, రామారావు, కుమారస్వామి, హరికృష్ణ, రాధాకృష్ణ, నిర్మల, త్రివేణి, తులసమ్మ, జగదీష్, భాస్కరరావు, జనార్దన తదితరులు ఉన్నారు.

ఒడిశాకు మట్టి అక్రమ రవాణా



స్టువట్‌పేట నుంచి ఒడిశాకు అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

పాతపట్నం: మండలంలోని ఎస్.ఎస్.మనుగు పంచాయతీలోని కింగ, స్టువట్‌పేట పక్కన ఉన్న జీడి తోటలు, పంట పొలాల నుంచి మట్టిని అక్రమంగా ట్రాక్టర్‌లు, లారీలపై బైదలాపురం, రుగడ రహదారి మీదుగా ఒడిశాకు తరలిస్తున్నారు. గత నాలుగు రోజుల నుంచి ప్రతి రోజూ పది నుంచి పన్నెండు ట్రాక్టర్‌లపై పగలు, రాత్రుళ్లు ఒడిశాకు తరలిస్తున్నారని ఆయా గ్రామస్తులు అంటున్నారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా పర్లాకిమిడి పట్టణంలో రియల్ అస్టేట్‌లకు ఈ మట్టిని తరిలిస్తున్నారని చెబుతున్నారు. ఇదే విషయం రెవెన్యూ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేస్తామని ఆయా గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ రవిచంద్ర వద్ద ప్రస్తవించగా.. తాము ఎవరికీ అనుమతు ఇవ్వలేదన్నారు. మైన్స్ శాఖ నుంచి అనుమతులున్నా తమకు చెప్పాలన్నారు. అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు తెలితే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

కల్యాణం.. కమనీయం



శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తూరు: మెట్టూరు బిట్–1 ఆర్‌ఆర్ కాలనీలోని (కృష్ణాపురం) శివాలయం వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

కల్యాణాన్ని ఉత్సవ కమిటీ సభ్యుడు బూర్లె శ్రీనివాసరావు దంపతులు నిర్వహించారు. శివపార్వతుల కల్యాణ విశిష్టతను ఆలయ అర్చకుడు సిరిపురం పద్మారావు వివరించారు. సోమవారం అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని శ్రీనివాసరావు తెలిపారు.

నిద్రలేమితో వాహనాలు నడపవద్దు



లారీ డ్రైవర్‌తో ముఖం కడిగిస్తున్న పోలీస్

నరసన్నపేట: జాతీయ రహదారిపై వాహనాలు నడిపేవారు నిద్రలేమితో నడపవద్దని నరసన్నపేట ఎస్ఐ వై.సింహాచలం అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మడపాం టోల్‌గేట్ వద్ద వాహనాలను ఆపి డ్రైవర్లతో ముఖం కడిగించి, టీ తాగించి పంపించే కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టారు. గతంలో ఈ చర్య ద్వారా వేకువ జామున ప్రమాదాలు తగ్గాయని ఎస్పీ భావించి ఈ విధానాన్ని మళ్లీ అమలు చేయాలని సూచించారు. నరసన్నపేట పోలీసులతోపాటు ఎన్‌హెచ్ పెట్రోలింగ్ పోలీసులు వేకువ జామున టోల్ ప్లాజా వద్ద వాహనాల డ్రైవర్లతో ముఖం కడిగించి పంపుతున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ డ్రైవర్లు నిద్రలేమితో వాహనాలు పడపటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

21 నుంచి శ్రీరామ దీక్షలు

సరుబుజ్జిలి: రొట్టవలస శ్రీరామానంద ఆశ్రంలో ఈ నెల 21 నుంచి శ్రీరామ దీక్షలు వేయనున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు తొత్తడి వెంకటరమణస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీక్ష తీసుకోవాల్సిన భక్తులు దుస్తులు, పూజాసామగ్రితో ఉదయం 4 గంటలకు ఆశ్రమానికి హాజరుకావాలన్నారు.

వైభవంగా రామలింగేశ్వర స్వామి తిరువీధి

బూర్జ: మండలంలోని ఓ.వి.పేటలో గల రామలింగేశ్వర స్వామి తిరువీధి ఉత్సవాలు వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారికి నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సోమవారం ఉదయం 11 గంటలకు గ్రామంలోని రాణమ్మ కోనేరులో చక్రతీర్థ స్నానాలు నిర్వహించనున్నట్లు వైస్‌ఎంపీపీ తెలియజేశారు. ఉప్పినివలస గ్రామంలో మహా శివరాత్రి మరుసటి రోజు ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



సోలార్ తాగునీటి పథకానికి మరమ్మతులు చేస్తున్న గ్రామస్తులు

మెళియాపుట్టి: మండలంలోని పెద్దపద్మాపురం గ్రామంలోని బీసీ కాలనీలో కొద్దిరోజులుగా సోలార్ తాగునీటి పథకం పనిచేయకపోవడంతో ఆ వీధి వాసులు తాగునీటికి ఇక్కట్లు పడ్డారు. గ్రామ ప్రజలు, వార్డ్ సభ్యులు కలిసి ఆదివారం మరమ్మతులు చేశారు. దీంతో వీధి వాసులకు నీటి కష్టాలకు తీరాయి. గ్రామస్తులు వారిని అభినందించారు.

కలశ ప్రతిష్టకు రాజగోపురం సిద్ధం

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయం ముఖద్వారం వద్ద దేవదాయశాఖ నిధులు రూ.50 లక్షలతో నిర్మిస్తున్న గాలిగోపురం పనులు పూర్తయ్యాయి. త్వరలో గోపురంపై కలశ ప్రతిష్ట కోసం కుంభాభిషేకం ఏర్పాటు చేయనున్నట్టు ఆలయ ఈవో సూర్యనారాయణ ఆదివారం తెలిపారు. కుంభాభిషేకం నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని దేవాదాయశాఖకు సమాచారమిచ్చినట్లు ఈవో పేర్కొన్నారు.

శివనామ స్మరణే ముక్తికి మార్గం



ప్రవచనకర్త యాలలను సత్కరిస్తున్న దృశ్యం

కొత్తూరు: శివనామ స్మరణే ముక్తికి మార్గమని ప్రముఖ ప్రవచనకర్త యాలల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పారాపురంలో శివపార్వతుల విశిష్టతను శనివారం రాత్రి వివరించారు. ప్రతి వ్యక్తి తన జన్మలో ఒక్కసారి అయిన శివరాత్రి పూజను ఆచరించాన్నారు. శ్రీనివాసరావును పారాపురం సర్పంచ్ కుంచాల రత్నాలు రాంబాబు, టీటీడీ ఆధ్యాత్మిక మండల కన్వీనర్ పాగిరి రవి, భక్తులు సత్కరించారు.

ఘనంగా పడియా కార్యక్రమం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జలుమూరు: శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం స్వామివారికి పడియా కార్యక్రమం అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేపట్టారు. శివరాత్రి జాగరణం చేసిన భక్తులు ఆదివారంవేకువ జాము నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. సాలగ్రామ దానాలు చేశారు. రెండో రోజు కూడా పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

నేత్రపర్వం.. పరమేశ్వరుని తిరువీధి ఉత్సవం



కాలభైరవాలయం వద్ద నాగావళి తీరాన 11 అడుగుల శివలింగానికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: మహా శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో పరమేశ్వరుని ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. జిల్లా కేంద్రంలోని గుడివీధిలో ఉమారుద్ర కోటేశ్వరస్వామిని మహానందీశ్వర వాహనంపై ఉంచి పూలతో ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని పలు ఆలయాలకు చెందిన ఉత్సవమూర్తులను వాహనాలపై ఉంచి ఊరేగింపుగా మేళతాళాలతో ఏడురోడ్ల కూడలి వద్దకు తీసుకొచ్చారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. గుడివీధి ఉమారుద్రకోటేశ్వరస్వామి, కొన్నావీధి భీమేశ్వర స్వామి, బోడెమ్మకోనేరులోని జీవేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖర శర్మ, పెంట శ్రీనివాసశర్మ, గంట చిన్నరామమూర్తి, ఉమామహేశ్వరరావు తదితరలు పాల్గొన్నారు.

లింగోద్భవ సమయంలో..

– నాగావళి తీరాన ఉన్న బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయం ఆధ్వర్యంలో లింగోద్భవ కాలంలో 11 అడుగుల శివలింగానికి పుష్పార్చనలు, జలాభిషేకం, ద్వాదశ హారతి సేవలను పీఠం నిర్వాహకులు గణేష్ గురుజీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.

– అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఉమారుద్రకోటేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశవార మహారుద్రాభిషేకం, 100 కేజీల బియ్యంతో అభిషేకం, లక్ష బిళ్వార్చన, అమ్మవారికి కుంకుమార్చనలు జరిగాయి. నక్కవీధి ఉమాజఠలేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.